క్లుప్తంగా

అధిక నీటి బిల్లులను తగ్గించండి



నీటి బిల్లులపై ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

కుత్బుల్లాపూర్: అధిక నీటి బిల్లులను తక్షణమే తగ్గించాలని, సివరేజ్ చార్జీలను తొలగించాలని కోరుతూ శనివారం కొంపల్లి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు బైరి శ్రీవిద్య, సరిత, కందాడి జ్యోత్స్న నీటిపారుదల శాఖ రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశారు. నల్లా కనెక్షన్ దారుల నుంచి అధికంగా చార్జీలు వసూలు చేస్తుండటంతో పేద మధ్యతరగతి ప్రజలకు పెనుభారంగా మారుతోందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో అమలు చేస్తున్న 20వేల లీటర్ల ఉచిత పథకాన్ని కొంపల్లి మున్సిపాలిటీకి సైతం వర్తింపజేయాలని కోరారు.

ఘనంగా 'బ్లూమ్ ఫెస్ట్' ఈవెంట్



నిజాంపేట్: విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని మేడ్చల్ జిల్లా విద్యాశాఖాధికారిణి విజయకుమారి అన్నారు. శనివారం బాచుపల్లిలోని విజ్ఞాన జ్యోతి ప్రీ ప్రైమరీ స్కూల్‌లో 'బ్లూమ్ ఫెస్ట్' పేరుతో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీఈఓ విజయకుమారి, పెండ్యాల ప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ ప్రెసిడెంట్ నృపాల్ చౌదరి ప్రత్తిపాటి, వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్ డైరెక్టర్ కొడాలి విజయరాణి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో అక్రమ నిర్మాణాన్ని శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. జి ప్లస్ టూ భవన నిర్మాణానికి అనుమతి తీసుకున్న నిర్మాణదారుడు నాలుగు అంతస్తుల భవనం నిర్మించాడు. అతడికి నోటీసులు జారీ చేసిన అధికారులు అదనంగా నిర్మించిన నిర్మాణాన్ని స్లాబ్‌లు, గోడలు కూల్చివేశారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్‌రావు, టీపీఎస్ ప్రశాంతి, ఆర్ ఐ శ్రీదేవి, డీటీఎఫ్ , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



ఈస్ట్ సత్యం ఎన్‌క్లేవ్‌లో పర్యటిస్తున్న భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. శనివారం ఆయన జీడిమెట్ల డివిజన్ ఈస్ట్ సత్యం ఎన్‌క్లేవ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు పేర్కొనగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ వాసులు, బీజేపీ నాయకులు హనుమంత్‌రావు, డానియేల్, బోజీ రెడ్డి, ప్రభాకర్ రావు, శ్రీనివాస్‌రావు, శాంతిరాజు, కొండారెడ్డి, రామ్‌దేవ్ రావు, రాంచంద్రారెడ్డి, రాజు, వెంకటరామారావు, యాదగిరి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు సరిగా రాయలేదని..
మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య




ప్రశాంత్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: పరీక్షలు సరిగా రాయలేదని మనస్తాపానికి లోనైన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. సుభాష్‌నగర్‌కు చెందిన ప్రశాంత్‌కుమార్ చౌదరి (17) మీనాక్షిలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల కుటుంబ సభ్యులు పని నిమిత్తం సొంత రాష్ట్రానికి వెళ్లగా ఇంట్లో ప్రశాంత్ ఒక్కడే ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడిని బంధువు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీ జాగా..వేసెయ్ పాగా

- సెప్టిక్ ట్యాంక్ స్థలంలో బహుళ అంతస్తుల భవనం
- అక్రమార్కుల నిర్వాకం
- స్థానికుల ఆందోళన



డాక్యుమెంట్‌లో సెప్టిక్ ట్యాంక్ స్థలంగా ఉన్న దృశ్యం..



సెప్టిక్ ట్యాంక్ స్థలంలో ఏర్పాటు చేసిన పిల్లర్లు

కుత్బుల్లాపూర్: సుమారు రూ.నాలుగు కోట్ల విలువ చేసే స్థలం అది, సెప్టిక్ ట్యాంక్ ఏర్పాటు చేయాల్సిన సదరు స్థలంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి హెచ్ఎండీఏ అనుమతులు ఇవ్వడంతో స్థానికులు అవాక్కయ్యారు.. ఇదేమని అడిగేలోపే పిల్లర్లు ఏర్పాటు చేసి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.. ఈ విషయం తెలియడంతో కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ శనివారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి అక్కడికి వెళ్లి నిర్మాణాన్ని పరిశీలించారు. గతంలో ఉన్న లేఅవుట్‌ను పరిశీలించి ప్రభుత్వ స్థలంలో ఏ విధంగా పర్మిషన్ ఇచ్చారన్న విషయంపై ఆరా తీశారు.. హెచ్ఎండీఏ అధికారులు అనుమతులు రద్దు చేసే వరకు స్థానికులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ఆది నుంచి అక్రమాలే...

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో జయభేరి పార్క్ లే అవుట్ ఏర్పాటు చేసి ఎక్కడపడితే అక్కడ ఖాళీ స్థలాలు వదిలివేశారు.దీనిని అదునుగా తీసుకున్న కొందరు వ్యక్తులు లేఔట్ మార్చి ప్లాట్లు చేసి తిరిగి క్రయవిక్రయాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో సర్వే నెంబర్ 149లో సెప్టిక్ ట్యాంక్ కోసం వదిలిన సుమారు 750 గజాల స్థలంలో నిర్మాణానికి అనుమతి ఇవ్వడం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై గతంలో మున్సిపల్ అధికారులు ఆరా తీయగా 'గ్రేటర్' అధికారులు అనుమతులు ఇచ్చినట్లు నిర్మాణదారులు పేర్కొంటున్నారు. అయితే స్థానికులు సదరు స్థలం సెప్టిక్ ట్యాంక్ కోసం కేటాయించినదంటూ ఆందోళనకు దిగడంతో సమస్య మొదటి కొచ్చింది.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శ్రీశైలంయాదవ్

తప్పుడు డాక్యుమెంట్లతో ఆక్రమణ..

రూ. కోట్ల విలువైన ఈ స్థలంపై కొందరు అక్రమార్కులు కన్నేసి గతంలో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అనుమతులు తెచ్చుకున్నారని, ఈ విషయంపై ఇప్పటికే మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి డాక్యుమెంట్లు పరిశీలించమని ఆదేశించడం జరిగిందని, త్వరలోనే నిజా నిజాలు వెలుగులోకి వస్తాయని, హెచ్ఎండీఏ నుంచి అనుమతులు తీసుకువచ్చిన పత్రాలను రద్దు చేసే వరకు ఊరుకునేది లేదని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. ప్రజా అవసరాల కోసం వినియోగించాల్సిన ఈ స్థలం సెప్టిక్ ట్యాంకు మార్కు చేసి లేఅవుట్ లో ఉందని స్థానికులు తన దృష్టికి తీసుకు వచ్చినట్లు తెలిపారు.

పనులు నిలుపుదల చేయించాం



జయభేరి పార్కు కాలనీలో ప్రజా అవసరాల కోసం వదిలివేసిన సెప్టిక్ ట్యాంక్ స్థలాన్ని సిబ్బంది పరిశీలించారు. పనులను ఆపడంతో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులతో సమగ్ర విచారణ జరిపి గ్రేటర్ అధికారులకు నివేదిస్తాం. తప్పుడు డాక్యుమెంట్లుగా తేలితే తప్పకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. పూర్తిగా వివరాలు తెలుసుకున్న తర్వాతనే అక్కడ పనులు జరిగేలా చూస్తాం.

– శ్రీహరి, కొంపల్లి మున్సిపల్ కమిషనర్

ప్రశ్నాపత్రాల లీకేజీపై సీబీఐ విచారణ జరిపించాలి



శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో ధర్నాకు తరలి వెళ్తున్న బీజేపీ కార్యకర్తలు

కుత్బుల్లాపూర్: టీఎస్‌పీఎస్‌సీలో ప్రశ్నా పత్రాల లీకేజీలు సహజమని సాక్షాత్తు రాష్ట్ర మంత్రి పేర్కొనడం సిగ్గు చేటని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. టీఎస్‌పీఎస్‌సీ లీకేజీ వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఇచ్చిన పిలుపు మేరకు ఇందిర పార్కులో చేపట్టిన నిరుద్యోగ మహాధర్నాకు శనివారం షాపూర్‌నగర్ నుంచి శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్‌సీ లీకేజీ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని, టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్, సభ్యులను సస్పెండ్ చేయాలని, నిరుద్యోగులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం మొత్తం పరీక్ష పత్రాల లీకేజీలు, లిక్కర్ కుంభకోణాలతోనే నడుస్తుందని, ఉద్యోగ నోటిఫికేషన్‌లు వేసి రాష్ట్ర ప్రభుత్వం లీకేజీలు, లిటిగేషన్లు పెట్టి నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌గా జనార్ధన్ రెడ్డిని తొలగించి కేసు నమోదు చేయాలని, బీజేపీ ప్రభుత్వం రాగానే యూపీఎస్సీ తరహాలో రాష్ట్రంలో ఉద్యోగ కాలెండర్ విడుదల చేసి నియామకాలు పారదర్శకంగా జరుపుతామన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ రాము గౌడ్, కొంపల్లి కౌన్సిలర్లు రజినీ, జీవన్ రెడ్డి ఉదయ్ జిల్లా ఉపాధ్యక్షులు గరిగే శేఖర్, జిల్లా కార్యదర్శి జగన్‌మోహన్‌రావు, డివిజన్ అధ్యక్షులు కంది శ్రీరాములు, దుర్యోధనరావు, పున్నారెడ్డి, రాజేశ్వరరావు, డివిజన్ ఇంచార్జీలు మోత శ్రీనివాస్ రాజిరెడ్డి, సుశాంత్ గౌడ్, కృష్ణ యాదవ్, బిల్లా వెంకటేష్, బీజేవైఎం నాయకులు సాయిరామ్‌రెడ్డి దయాకర్, వారాల మహేష్, జూల సందీప్, ఆకుల విజయసాయి, మహిళా మోర్చా నాయకులు అరికెల సుధా, అరవేలు, అరుణ రెడ్డి, సంగీత పాత్ర , రాజమణి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ మ్యాక్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జీడిమెట్ల: సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎంపీపీ, టీపీసీసీ ప్రతినిధి కొలను హన్మంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన రిలే నిరహారదీక్ష చేస్తున్న సూపర్ మ్యాక్స్ పరిశ్రమ కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల కష్టంతో అభివృద్ధి చెందిన సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ నిర్వాహకులు కార్మికులను రోడ్డున పడేసిందన్నారు. పరిశ్రమలో ఏవైనా తగాదాలు ఉంటే డైరెక్టర్లు చూసుకోవాలని వాటిని కార్మికులపై రుద్ది రాజకీయాలు చేయడం సబబుకాదన్నారు. పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించకుండా వారిని ఇబ్బంది పెడుతుందన్నారు. కార్మికులకు యాజమాన్యాలు అన్యాయం చేసినా న్యాయాలు, చట్టాలు వారికి అన్యాయం చేయవన్నారు. కార్మికుల తరఫున కొట్లాడి చట్ట ప్రకారం వారికి రావాల్సిన ప్రతి పైసా ముక్కు పిండి వసూలు చేయిస్తామన్నారు. యాజమాన్యం ఇప్పటికైనా తాము చేసిన తప్పును గుర్తించి కార్మికులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శనివారం మేయర్ కొలను నీలాగోపాల్‌రెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రామకృష్ణారావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. పలు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులు, డ్రైనేజీ పనులు, వైకుంఠధామాల అభివృద్ధి, హరితహారం, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు తదితర అంశాలపై ఆయా విభాగాల అధికారులతో సమీక్షించారు.

ఏఐసీటీఈ ల్యాబ్ ప్రారంభం

నిజాంపేట్: ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్స్ ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని డివై పాటిల్ యూనివర్సిటీ ఉప కులపతి డా.ప్రభాత్ రంజన్ అన్నారు.శనివారం బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్(ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్)ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.ప్రభాత్ రంజన్ మాట్లాడుతూ ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్స్ దేశంలో 91 మాత్రమే ఉన్నాయన్నారు. ఒక విద్యార్థి ఒక మంచి ఆలోచనతో ఈ ప్రయోగశాలలో అడుగు పెడితే ఒక గొప్ప ఆవిష్కరణతో బయటకు వచ్చేలా ఇందులో అవసరమైన అన్ని పరికరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏఐసీటీఈ స్కాలర్‌షిప్స్, గ్రాంట్స్ సలహాదారు డా.నీరజ్ సక్సేనా మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థుల సాంకేతిక నైపుణ్య అభివృద్ధికి ఈ ప్రయోగశాల ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గోకరాజు లాంటి ప్రైవేటు విద్యా సంస్థల సహకారంతో ఇలాంటి ప్రయోగశాల ఏర్పాటు సాకారమైందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాణి గోకరాజు, ప్రిన్సిపాల్ డా.ప్రవీణ్, ఐడియా ల్యాబ్ సమన్వయకర్తలు బాలాజీ , రాధానంద్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.



గోకరాజు రంగరాజు కళాశాలలో ఏఐసిటిఈ ల్యాబ్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

హెచ్ఎంఏ అవార్డు ప్రదానం

రంగారెడ్డినగర్: ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) బెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డును ది ఆదర్శ్ కో.ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ ఫౌండర్ డైరెక్టర్ జి.మదన గోపాలస్వామి అందుకున్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో 50వ హెచ్ఎంఏ అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నల్సర్ లా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు కో.ఆపరేటివ్ బ్యాంక్ రంగంలో విశిష్ట సేవలందిస్తున్న ఆదర్శ్ కో.ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ ఫౌండర్ డైరెక్టర్ జి.మదన గోపాలస్వామికి బెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మదనగోపాలస్వామి మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా వినియోగదారులకు ఉత్తమ సేవలందిస్తున్నామని, 24/7 ఏటీఎంలను అందుబాటులో ఉంచామన్నారు. చిన్నతరహా, ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు 67 శాతం మేర రుణాలు అందజేస్తూ వాటి పురోభివృద్ధికి తమ బ్యాంక్ కృషి చేస్తోందన్నారు. అత్యుత్తమ బ్యాంకింగ్ ప్రమాణాలను పాటిస్తూ కో.ఆపరేటివ్ బ్యాంక్ రంగంలో ఆదర్శ బ్యాంక్ అగ్రగామిగా నిలిచిందన్నారు. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తితో వినియోగదారులకు మెరుగైన సేవలు, సకాలంలో రుణాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.



అవార్డు అందుకుంటున్న మదన గోపాలస్వామి

మోడల్ కార్పొరేషన్‌గా నిజాంపేట్

నిజాంపేట్: నిజాంపేట్‌ను మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం ప్రగతి యాత్రలో భాగంగా బాచుపల్లిలో రాజీవ్ గాంధీనగర్, హిల్ కౌంటీ ప్రాంతాల్లో మేయర్ కొలను నీలాగోపాల్‌రెడ్డి, కమిషనర్ రామక్రిష్ణారావు స్థానిక కార్పొరేటర్లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీనగర్ 15వ వార్డులో పత్తికుంట వద్ద రూ.35 లక్షలతో నిర్మించిన చైన్ లింక్ మెష్, రూ.17 లక్షలతో భూగర్భ డ్రైనేజీ, రూ.15 లక్షలతో పూర్తి చేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. మంచినీటి రిజర్వాయర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం హిల్ కౌంటీ క్లబ్ హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కాలనీ వాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. డంపింగ్ యార్డును నుంచి మరో చోటుకు తరలించాలని కోరారు. గ్రేవ్ యార్డును తరలించినందుకు ఎమ్మెల్యేకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. సర్వే నెంబర్ 186లో ఉన్న 10 ఎకరా స్థలంలో పరేడ్ గ్రౌండ్ ఏర్పాటు చేయాలని కోరారు. అదనపు ట్రాన్స్ ఫార్మర్‌లను సైతం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానన్నారు. తన దృష్టికి వచ్చిన అన్ని సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు సుజాత, బాలాజీ నాయక్, డీఈఈ సుదర్శన్ రావు, వాటర్ వర్క్స్ డీజీఎం మహేశ్, బిఆర్ఎస్ ఎన్ఎంసి అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, హిల్ కౌంటీ విల్లాస్ అధ్యక్షుడు డా.సునీల్ తదితరులు పాల్గొన్నారు.



హిల్‌కౌంటీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే



రాజీవ్ గాంధీనగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ , మేయర్ నీలారెడ్డి

రూ.9.90 కోట్లతో అభివృద్ధి పనులు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీని అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి అన్నారు. శనివారం కమిషనర్ సత్యనారాయణ అధ్యక్షతన దుండిగల్ మున్సిపల్ 16వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.9.90 కోట్ల అభివృద్ధి పనులకు తీర్మానం చేసి సభ ఆమోదించింది. యూజీడీ పైప్‌లైన్‌కు రూ.342 లక్షలు, వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.482 లక్షలు, 3వ వార్డులో ఓపెన్ నాలాకు రూ. 20 లక్షలు, 12వ వార్డులో అంగన్‌వాడీ సెంటర్ కోసం రూ.20 లక్షలు, బౌరంపేట్‌లో ముదిరాజ్ భవన్ నిర్మాణానికి రూ. 25 లక్షలు, మహేశ్వరంలో ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రూ.12 లక్షలు, 3వ వార్డులో ముదిరాజ్ భవన్‌కు రూ.10 లక్షలు, 4వ వార్డులో విశ్వా కర్మ భవన్ కోసం రూ.10 లక్షలు, వాటర్ సంప్ నిర్మాణానికి రూ.15 లక్షలు, డివైడర్ నిర్మాణానికి రూ.5 లక్షలు, 19వ వార్డులోని సింహపురి కాలనీ సీసీ రోడ్డు కోసం రూ.25 లక్షలు, 20వ వార్డులో ఫంక్షన్ హాల్‌కు రూ.15 లక్షలు, 1వ వార్డులో హెచ్‌డీపీఇ పైప్ లైన్ కోసం 3 లక్షలు కేటాయించారు. అనంతరం చైర్‌పర్సన్ కృష్ణవేణి కౌన్సిలర్లు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు సుంకరి కృష్ణ, మున్సిపల్ ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్, మిషన్‌భగీరథ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ కృష్ణవేణి, కమిషనర్ సత్యనారాయణరావు

గాంధీనగర్‌లో స్వచ్ఛ సర్వేక్షన్



రంగారెడ్డినగర్: రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో శనివారం జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది స్వచ్ఛ సర్వేక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రోడ్లపై పేరుకుపోయిన చెత్త చెదారాలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. బస్తీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళుల్పించారు. కార్యక్రమంలో జల్దా రాఘవులు, ఎస్ఎఫ్ఏ సత్యవతి, బాలయ్య, వాజిద్, లక్ష్మినాద్, సంగయ్య, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్: నిద్రమత్తులో భవనంపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కొంపల్లికి చెందిన పెర్నిధి శ్రీను (41) కూలీగా పని చేస్తున్నాడు. ఇటీవల అతను కొంపల్లి సెంట్రల్ పార్కులోని సుబ్రహ్మణ్యం అనే వ్యక్తికి చెందిన భవన నిర్మాణ పనుల నిమిత్తం మేస్త్రీ గోవిందరెడ్డి వద్ద పనికి కుదిరాడు. ఈ నెల 24న రాత్రి మేస్త్రీతో కలిసి శ్రీను భవనంపై నిద్రించాడు. అర్ధరాత్రి బాత్‌రూమ్‌కు వెళ్లిన శ్రీను నిద్రమత్తులో భవనం టెర్రస్ నుంచి కింద పడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం



సమావేశంలో పాల్గొన్న శంభీపూర్ రాజు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్, మర్రి రాజశేఖర్‌రెడ్డి..



హాజరైన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

దుండిగల్: కార్యకర్తలే పార్టీకి బలమని, వారి సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తుందని రాష్ట్ర రైతుబంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర రైతుబంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారులు, ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ తగిన గుర్తింపునిస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ రాష్ట్రం నిలుస్తోందన్నారు. స్వరాష్ట్రం సాధించిన నాటి నుండి అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తోందన్నారు. బీజేపీ కేవలం మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ పథకాలు అమలు చేసి చూపించాలని సవాల్ చేశారు. 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిన కేంద్ర ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు గుణ పాఠం చెబుతారన్నారు. ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక ఈడీ, ఐటీ దాడులు చేస్తూ బీఆర్ఎస్ నేతలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో దేశవ్యాప్తంగా పార్లమెంట్ సీట్లలో పోటీ చేసి గులాబీ జెండా ఎగురవేస్తామన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించడం జరుగుతుందని, అందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందించేందుకు చర్యలు తీసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మున్సిపాలిటీల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు, డివిజన్ల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.